ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 4 ఆగస్టు 2025 | 5



కాకినాడ జిల్లా క్రీడా మైదానం వద్ద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

నేటి నుంచి ఆర్మీ ర్యాలీ

12 జిల్లాల నుంచి 15 వేల మంది కాకినాడ రాక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12 జిల్లాల నుంచి అభ్య ర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇక్కడ దేహదారుఢ్య పరీక్ష, 1.6 కి.మీ రన్, మెడికల్ అండ్ ఫిట్‌నెస్ టెస్టులు, లాంగ్‌జంప్, పుల్ అప్స్, నైన్ ఫీట్ డిచ్ అండ్ జిగ్‌జాగ్ ఇలా ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అనేక రకాల ఈవెంట్లు జరగనున్నాయి. రోజుకు 600 నుంచి 800 మంది రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి, వందమంది చొప్పున 1.6 కి.మీ రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు.20 రోజులపాటు జరిగే రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 15 వేల మంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. తొలి రోజు 5వ తేదీ అంటే 4వ తేదీ సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభయ్యే ర్యాలీలో తొలి రోజు 600 మంది పాల్గొననున్నారు. రెండో రోజు ఆరో తేదీ (ఐదో తేదీ అర్ధరాత్రి) మరో 671 మంది, 7,8,9 తేదీల్లో వరుసగా మూడు రోజుల్లో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులు ర్యాలీలో పాల్గొంటారు. 10వ తేదీన విరామం. 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు రోజుకు 800 మంది పాల్గొంటారు. 15వ తేదీ స్వాతంత్ర్యం దినోత్సవం రోజున సెలవు ప్రకటించారు. 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరగనుంది. 20న రెస్ట్ డేతో మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

జిల్లాల వారీగా ర్యాలీ షెడ్యూల్ ఇలా..

ఆగస్టు 5వ తేదీ : అల్లూరిజిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్

ఆగస్టు 6, 7, 8 :	అనకాపల్లి
ఆగస్టు 7 :	యానాం
ఆగస్టు 8, 9 :	పార్వతీపురం
ఆగస్టు 9, 11 :	విశాఖపట్నం
ఆగస్టు 11, 12, 13, 14, 16 :	శ్రీకాకుళం
ఆగస్టు 16, 17, 18, 19 :	విజయనగరం
ఆగస్టు 19 :	కాకినాడ జిల్లా

తల్లీ..ఇద్దరు కుమార్తెల హత్య
సామర్లకోటలో దారుణం 7

నేటి నుంచి వాడపల్లిలో పవిత్రోత్సవాలు
మూడు రోజుల నిర్వహణ 7

త్రిసభ్య కమిటీలపై కసరత్తు



- జిల్లాలో 24 సొసైటీలకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల కొనసాగింపు
- జూలై 31కే ముగిసిన గడువు
- వచ్చే జనవరి 30వరకూ పొడిగింపు
- కూటమి నేతలను నియమిస్తే వారికే బాధ్యతలు

పిఠాపురం,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల ఏర్పాటుపై కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 24 సొసైటీల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల గడువు ముగిసినా వారినే మరో ఆరునెలలపాటు కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి నేతలను ఈ కమిటీలకు అధ్యక్ష, డైరెక్టర్లుగా నియమిస్తే అప్పటినుంచి వారికే బాధ్యతలు అప్పగించనున్నారు.

సహకార సంఘాల ప్రక్షాళన, పునర్వ్యవస్థీకరణ చేయనున్న నేపథ్యంలో గతంలో మాదిరిగా త్రిసభ్య కమిటీలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రెండు విడతలుగా పలు సొసైటీలకు ఒక అధ్యక్షుడు, ఇద్దరు డైరక్టర్లు వంతున అనధికారులతో కమిటీలను నియమించింది. కొన్నిచోట్ల త్రీమెన్ కమిటీల కసరత్తు పూర్తికాలేదు. కూటమి నేతల మధ్య చర్చలు కొలిక్కిరాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు చెప్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 12సొసైటీలకు ఒక్కదానికీ ఇప్పటివరకూ త్రిసభ్యకమిటీని నియమించలేదు.

ఎందుకీ జాప్యం?

జూలై నెలాఖరు నాటికి సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియమాకం పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకూ సగం సంఘాలకు మాత్రమే కమిటీల ఏర్పాటు పూర్తయి ప్రభుత్వం జీవో జారీ చేసింది. మిగిలిన కమిటీలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, టీడీపీ, జనసేన, టీడీపీ నేతల నుంచి జాబితాలు తీసుకున్నప్పటికీ రాష్ట్రస్థాయిలో ఆమోదం పొందకపోవడంతో ఆలస్యం జరుగుతున్నట్లు సమాచారం. పిఠాపురం నియోజకవర్గంలో 12సొసైటీలు ఉండగా టీడీపీ, జనసేన నేతల మధ్య జరిగిన చర్చల్లో జనసేన 8, టీడీపీ 4 సహకార సంఘాలు తీసుకునేలా ఒప్పందం కుదిరింది. ఛైర్మన్లు, డైరెక్టర్ పదవులను ఇదే రీతిలో నియమించేందుకు వీలుగా ఆయా పార్టీలు పేర్లు ఖరారు చేశారు. ఇప్పటికే టీడీపీ అనధికారికంగా ఛైర్మన్ అభ్యర్థులకు ఖరారు చేసింది. జనసేన నుంచి ఇంకా పూర్తిస్థాయిలో పేర్లు ఖరారు కాలేదని చెప్తున్నారు. అది, సోమవారాల్లోగా జాబితాలను పంపే అవకాశం ఉందని తెలుస్తోంది.

మరో ఆరునెలల గడువు పొడిగింపు

త్రిసభ్య కమిటీలు నియమించని కాకినాడ జిల్లాలోని 24 సహకార సంఘాలకు సహకార శాఖ అధికారులు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. వీరి గడువు జూలై 31వతేదీతో ముగిసింది. దీంతో వీరిని మరో ఆరునెలలపాటు కొనసాగిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, చేబ్రోలు,చెందుర్తి, అగ్రహారం,రాయవరం, పి.దొంతమూరు, కొత్తపల్లి, ఇసుకప ల్లి, యండపల్లి, నాగులాపల్లి, కొమరగిరి, ఇసుకపల్లి సొసైటీలు, పిఠాపురం సీబీఐ ఎఫ్ఎస్‌సీఎస్‌లతోపాటు జిల్లాలోని అచ్చంపేట, కోలంక,పెద్దాపురప్పాడు, తాళ్లరేవు, లచ్చిపాలెం, పెదపూడి, ఏపీత్రయం, కుమారప్రియం, కాండ్రేగుల, పైన, తొండంగి, కాండ్రకోట సొసైటీల ప్రసుత అఫిషియల్ పర్సన్‌ఇన్‌చార్జిల గడువును జనవరి 30వరకూ పొడిగిస్తూ జీవో 641 జారీచేసింది.

త్రిసభ్య కమిటీలు వచ్చే వరకూ..

అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల గడువును పెం చడంతో కూటమి నేతల్లో కొంత గందరగోళం ఏర్పడింది.వీటికి కమిటీలనునియమించరా అనే సందేహాలు వెలువెత్తాయి. త్రిసభ్య కమిటీలను నియమించే వరకూ మాత్రమే అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగుతారని సహకారశాఖ అధికారులు స్పష్టం చేశారు. గడువు పొడిగించకపోతే సొసైటీల కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. దీంతోనే నియోజకవర్గాలు నుంచి వెళ్లే త్రీమెన్ కమిటీల జాబితా ఆమోదం పొందేవరకూ వీరిని కొనసాగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు.

రెడీఎస్సీ!



15లోపు మెగా డీఎస్సీ ఫలితాలు

- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ
- అభ్యర్థుల ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లా పోస్టులు 1241
- పరీక్షకు 38,617 మంది హాజరు
- ఒక్కో పోస్టుకు 50 మంది పోటీ
- 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- నెలాఖరుకు టీచర్లకు శిక్షణ
- కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- గత వైసీపీ ఐదేళ్లు మాటలే
- మరో హామీ నెరవేర్చినట్టే

లక్షలాది మంది నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగం ఒక కల..గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వంలో ఊరించి ఉసూరుమనిపించి ఆ కలకు బ్రేకులు వేసింది..అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డీఎస్సీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు.. అనుకున్నట్టుగానే నోటిఫికేషన్ విడుదల చేశారు.. పరీక్షలు నిర్వహించారు.. మరో 13 రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.. ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.. అప్పుడే ఫలితాలకు ఎదురుచూపులు ఆరంభమయ్యాయి.. 1241 పోస్టులకు 60 వేల మంది క్యూలో ఉన్నారు.. ఎవరిని అదృష్టం వరిస్తుందో చూడాలి..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చింది..యువత కల తీరుస్తోంది..ఎన్నేళ్ల కలలనో తీరుస్తోంది. ప్రభుత్వ కొలువులు ప్రకటనలు విడుదల చేస్తూ అభ్యర్థుల ఎంపిక చేపడుతోంది. దీనిలో భాగంగానే గురువారం పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలను విడుదల చేసిన కూటమి సర్కారు డీఎస్సీ అభ్యర్థులకు తీపి కబురు చెప్పింది. ఫలితాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న వారికి శుభవార్త వినిపించింది. ఈ నెల ఒకటో తేదీన కీ విడుదల చేసిన విద్యాశాఖ ఈ నెల 15లోపు మెగా డీఎస్సీ-2025 ఫలితాలను విడుదల చేస్తామని విద్యాశాఖ ప్రకటించింది. దీంతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కీ పరిశీలనతో ఓ నిర్ణయానికి వచ్చిన అభ్యర్థులు ఫలితాలకు ఎదురుచూస్తున్నారు. 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన,నెలాఖరుకు కొత్త టీచర్ల పోస్టింగ్‌లు, శిక్షణ అన్నీ చకచకా జరగనున్నాయి.

63,004 దరఖాస్తులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈ సారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదు లో ముందున్నారు.కేటగిరీల వారీగా ఓసీ-5120, బీసీ-ఏ 2810, బీసీ-బీ 6991, బీసీ-సీ 554, బీసీ-డి 3636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2572, ఎస్సీ గ్రేడ్-3 10,066,ఎస్టీ 6,213, ఈడబ్ల్యూఎస్ 3,782,దివ్యాంగుల కేటగిరీ నుంచి వీహెచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు.

1241 ఉపాధ్యాయ పోస్టులు

ఉమ్మడి జిల్లాలో 1241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి.స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78,ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సో షల్ 132, వ్యాయామవిద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్-2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు.

నాడు ఊరించి.. ఉసూరుమనిపించి..


గత వైసీపీ సర్కారు నిరుద్యోగులను నట్టేట ముంచింది. ఉద్యోగాల పేరుతో ఊరించి ఆ ఐదే ళ్లూ ఉసూరుమనిపించింది. ముఖ్యంగా మెగా డీఎస్సీ అంటూ దగా చేసింది. ఆ ఐదేళ్లు ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు. దీంతో ఎంతో మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు.ఆ ప్రభావం వైసీపీ ఓటమిపైనా పడింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటించింది.ఈ నెలాఖరుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని పూర్తి చేయనుంది.

ఉత్కంఠగా..

- కాకినాడలో మూడో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు 7



కాకినాడలోని క్రీడా మైదానంలో హాకీ ఆడుతున్న ఉత్తరాఖండ్, అస్సాం జట్లు



శాంతించిన గోదారి!

ధవళేశ్వరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పడుతున్న గోదావరి ఆదివారం నాటికి మరింత తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం సాయంత్రానికి 2,57,545 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7000 క్యూసెక్కుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

నిధులున్నా.. కేటాయింపుల్లో.. జాప్యం



- ఇది కాకినాడ ఎంపీ లాడ్స్ పరిస్థితి
- రెండేళ్లకు రూ.10కోట్లు నిధులు రాక
- కానీ ఇప్పటివరకు పనులకు వెచ్చించింది రూ.2.19కోట్లు మాత్రమే
- ఎమ్మెల్యేలు పంపుతున్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చని వైనం

కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. రెండేళ్లలో కేంద్రనుంచి ఎంపీ లాడ్స్ పుష్కలంగా వచ్చాయి. నియోజక వర్గంలో చేయాల్సిన పనులు కూడా పెద్దఎత్తున ఉన్నాయి. నిధులు కేటాయింపులో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులు పడకేస్తున్నాయి.

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటు నియోజకవర్గానికి ఎంపీ లాడ్స్ నిధులు రెండుదఫాలుగా వచ్చాయి. 2024-25 సంవత్సరానికి గతేడాది రూ.5కోట్లు నిధులు విడుదలయ్యాయి. 2025-26 సంవత్సరానికి ఈఏడాది ఏప్రిల్ నెలలో మరో రూ.5 కోట్లు నిధులు వచ్చాయి. మొత్తంగా రూ.10 కోట్లు ఎంపీ లాడ్స్ నిధులు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటివరకు కేవలం రూ.2.19కోట్లు మాత్రమే ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పనులు నిమిత్తం కేటాయించారు. మిగిలిన రూ.7.81కోట్లు ఖజానాలో మూలుగుతున్నాయి. ఈనేపథ్యంలో జిల్లాలోఆరుగురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ప్రతిపాదనలు పంపుతున్నా కార్యరూపం దాల్చట్లేదు. నిధులు ఇవ్వాలని కోరినా ప్రయోజనం లేదని కొందరు ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

రూ.2.19కోట్లు కేటాయింపులు ఇలా..

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం పిఠాపురం పట్టణంలో 20, 21, 22 వార్డుల్లో ఇంటర్నెల్ సీసీడ్రైన్ల నిర్మాణాలకు రూ.50లక్షలు నిధులు ఇచ్చారు. యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో శ్మశానం గోడ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించారు. ఇదే మండలంలో పొన్నాడలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షల నిధులుఇచ్చారు. కాకినాడరూరల్ అసెంబ్లీ నియోజకవర్గం కరపమండలం యండమూరు గ్రామంలో రెండువార్డుల్లో మార్కెట్‌షెడ్ల నిర్మాణాలకు రూ.10లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రహారీలకు రూ.5లక్షలు నిధులు విడుదల చేశారు. తుని నియోజకవర్గంలో తొండంగి మండలంలో ఎల్లయ్యపేటలో మల్టీపర్పస్ హాలు(సామాజికభవనం) నిర్మాణానికి రూ.40లక్షల నిధులు విడుదలచేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఇర్రిపాకలో ఏలేరు కెనాల్‌పై రిటర్నింగ్‌వాల్ నిర్మాణానికి రూ.60లక్షలు ఇచ్చారు. పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురంలో 29వ వార్డులో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.20లక్షలు, సామర్లకోటలో 13, 14 వార్డుల్లో కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు రూ.20 లక్షల నిధులు విడుదల చేశారు. దీనిలో కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని పనులు జరుగుతున్నాయి.

ఈ నియోజకవర్గాలకు లేవు

ఇప్పటివరకు ఎంపీ లాడ్స్ కేటాయింపుల్లో ఐదు నియోజకవర్గాలకు ప్రాధాన్యం కల్పించారు. ఇంకా కాకినాడ నగరం, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజవర్గాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో ఇక్కడ పనులకు కూడా నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు సిద్ధంగానే ఉన్నాయి: కలెక్టరేట్ అధికారులు

కొన్నిఅసెంబ్లీ నియోజకవర్గాలనుంచి పనులకు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కొన్నికారణాలవల్ల నిధులకేటాయింపులో జాప్యం జరుగుతోంది. ప్రాధాన్యక్రమంలో నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

వైసీపీ హయాంలో అరకొర పనులు

గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీలాడ్స్‌తో నిర్వహించిన పనులు అరకొరగానే సాగాయి. అప్పటి ఎంపీ వంగా గీతకు రూ.20కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించడానికి అవకాశం వచ్చింది. ఆశించినస్థాయిలో పనులు చేయలేకపోయారు. రూ.20కోట్లతో 361 పనులకు ప్రతిపాదించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి రూ.10కోట్లతో 156 పనులను మాత్రమే పూర్తిచేశారు. ఇంకా రూ.10కోట్లతో 165 పనులు పెండింగ్‌లోనే ఉంచారు. దీంతో గత ప్రభుత్వంలో కాకినాడ పార్లమెంటులో ఆశించినస్థాయిలో అభివృద్ధి జరగలేదు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడడంతో హడావిడిగా శంకుస్థాపనలు చేసి వదిలేశారు.

నేడు కలెక్టరేట్లో పీజీఆర్ఎస్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. పరిష్కార వేదికకు హాజరుకాలేని వారు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అర్జీదారులు అర్జీలకు సంబంధించిన సమాచారం,స్థితిగతులు తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయాలన్నారు.

సన్‌డే.. మండే!

- భానుడి భగభగలు
- జనం ఉక్కిరి బిక్కిరి
- నిర్మానుష్యంగా వీధులు

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎండతీవ్రత.. ఆపై ఉక్కపోత.. మండు వేసవిలో ఉన్నామా అనే రీతిలో వీచిన వేడిగాలులు, వాతావరణం ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసింది. గ్రీష్మతాపంతో తల్లడిల్లారు. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వేసవిని మరిపించే రీతిలో కాస్తున్న ఎండలతో పాటు పెరిగిన ఉక్కపోతతో అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు కాకినాడ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 36-38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉన్నా 43-44 డిగ్రీల ఉష్ణోగ్రతల వేళ ఉండే ఎండతీవ్రత ఉన్న పరిస్థితి కనిపించింది. గృహాలు, భవనాల లోపల భాగాలు వేడెక్కిపోవడంతో ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక ప్రజలు సతమతమయ్యారు. నాలుగు రోజులుగా ఎండ ఇదే రీతిలో కాస్తున్నప్పటికీ ఆదివారం మరీ తీవ్రంగా ఉంది. రుతుపవనాలు, బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని గతంలో చెప్పినా అది స్వల్ప వర్షాలకే పరిమితమైంది. తర్వాత నుంచి ఎండలు ప్రభావం మరింత అధికమైంది. కత్తిపూడి-చేబ్రోలు-గొల్లప్రోలు-పిఠాపురం-తిమ్మాపురం మధ్యగల 216వ జాతీయరహదారితో పాటు పిఠాపురం-సామర్లకోట, పిఠాపురం-ఉప్పాడ, పట్టణాలు, గ్రామాల్లో ప్రధాన రోడ్లన్నీ జనసంచారం అంతంత మాత్రంగానే ఉండడంతో నిర్మానుష్యంగా మారాయి. లారీలు, ఇతర భారీ వాహనదారులు రోడ్డు పక్కన నీడన నిలిపివేసి తీవ్రత తగ్గిన తర్వాత బయలుదేరారు. ఎండతీవ్రతకు ఏలేరు, పీబీసీ ఆయకట్టులోని వరి నారుమడులతో పాటు వెదజల్లు పద్ధతిలో వేసిన పంటతో పాటు మెట్ట గ్రామాల్లోని కాయగూరల పంటలు ఎండిపోతున్నాయి. కాలువల ద్వారా వస్తున్న నీరు సరిపోకపోవడంతో శివారు ప్రాంతాల్లో వరి సాగుకు ఇబ్బందికర పరిస్థితి ఉంది. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో వేసిన పత్తి, కాయగూరలు, ఇతర పంటలకు తడి లేక పొలాలు బీటలు వారే పరిస్థితి ఏర్పడింది.

ఎండతీవ్రతకు నిర్మానుష్యంగా మారిన పిఠాపురం-తిమ్మాపురం మధ్య గల 216వ జాతీయ రహదారి



సామర్లకోటలో దారుణం

తల్లీ, ఇద్దరు కమార్తెల హత్య

తలపై బలమైన ఆయుధంతో గట్టిగా కొట్టి చంపినట్టు భావిస్తున్న పోలీసులు


భార్య, కుమార్తెల మృతదేహాల వద్ద బోరున విలపిస్తున్న ప్రసాద్

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో ఆదివారం దారుణమైన సంఘటన జరిగింది. పట్టణంలోని సీతారామ కాలనీలో ఒక ఇంట్లోని తల్లి, ఇద్దరు కుమార్తెలు దారుణ హత్యకు గురయ్యారు. కుమార్తెల్లో ఒకరికి ఎనిమిదేళ్లు కాగా మరొకరికి ఆరేళ్లు కావడం విచారకరం. రోజూలాగే లారీ డ్రైవర్‌గా విధులకు వెళ్లిన వ్యక్తి ఉదయం ఇంటికి వచ్చి చూడగా తన భార్య, కూతుళ్లు విగత జీవులుగా రక్తపుమడుగులో పడి ఉండడంతో ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యాడు.

అసలేం జరిగింది?

వివరాల్లోకి వెళితే సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ ములపర్తి ప్రసాద్‌కు కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన మాధురి(26)తో పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వారికి కుమార్తెలు ములపర్తి పుష్పకుమారి (8), జెస్సీలోవ(6) ఉన్నారు. ఈ కుటుంబం గత కొంతకాలంగా బ్రౌన్‌పేటకు సమీపాన గల సీతారామకాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రసాద్ ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ లాగే శనివారం రాత్రి విధులకు వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఎంతకూ తలుపులు తీయకపోవడంతో వెనక తలుపులు తొలగించి లోపలికి వెళ్లగా గదిలో భార్య, కుమార్తెలు విగతజీవులుగా రక్తపు మడుగులో ఉండడాన్ని చూసి షాక్ తిన్నాడు. దీంతో సామర్లకోట పోలీసులకు సమాచారం అందించాడు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మరోపక్క కాకినాడకు చెందిన క్లూస్ టీం బృందాలు సంఘటనా స్థలిలో వేలి ముద్రలను సేకరించడంతో పాటు పోలీసు జాగిలాలను వదిలారు. ముగ్గురినీ తలపై బలమైన ఆయుధంతో గట్టిగా కొట్టి హతమార్చినట్టు పోలీసులు ప్రాథమికంగా భావించారు.


మాధురి (ఫైల్)



పుష్పకుమారి, జెస్సీలోవ (ఫైల్)

పోలీసు బృందాల గాలింపు : ఎస్పీ

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హుటాహుటిన సామర్లకోట చేరుకుని సంఘటనకు దారితీసిన పరిస్థితులపై సామర్లకోట పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ తల్లీ, ఇద్దరు కుమార్తెలను హత్య చేసినవారిని తక్షణం అరెస్ట్ చేసేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించినట్టు వెల్లడించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఎస్పీ వెంట పాల్గొన్నారు ఉన్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురికావడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కుమార్తెకు తెచ్చిన పెళ్లి సంబంధం నచ్చలేదని వెళ్లి

కాలువలో మృతదేహంగా తేలి...

జగ్గంపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కుమార్తెకు తెచ్చిన పెళ్లి సంబంధం నచ్చలేదని ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం పురుషోత్తపట్నం ఫేజ్2 పక్కన కాలువలో మహిళ మృతదేహంగా తేలింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఒడ్డుకు తీసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా పెద్దాపురం రాజు కాలనీకి చెందిన గడిగట్ల వరలక్ష్మి (47)గా నిర్ధారణ అయింది. ఆమెకు భర్త సాయిబాబా, ఇద్దరు కూతుర్లు ఉన్నట్టు గుర్తించారు. అయితే చిన్న కుమార్తెకు భర్త సాయిబాబా ఇటీవల పెళ్లి సంబంధం తీసుకురావడం, ఆ సంబంధం వరలక్ష్మికి నచ్చకపోవడంతో కుటుంబంలో కలహాలు వచ్చాయని, ఈనెల 2న ఉదయం ఇంటి నుంచి వరలక్ష్మి బయటకు వెళ్లిపోతుండగా కూతురు అడ్డుపడినా వెళ్లిపోయిందని భర్త సాయిబాబా పోలీసులకు తెలిపాడు. వెంటనే జగ్గంపేటలోని బంధువుల ఇళ్ల వద్ద వెతుకుతుండగా కాలువలో మృతదేహం లభ్యమైనట్టు తెలిసి వెళ్లి చూడగా తన భార్య వరలక్ష్మిగా గుర్తించినట్టు సాయిబాబా తెలిపాడు. పెళ్లి సంబంధం ఇష్టం లేక ఇంటి నుంచి బయటకు వచ్చేసిందని, వరలక్ష్మి కాలువలో ప్రమాదవశాత్తు జారిపడిందో లేక దూకేసిందో తెలియాల్సి ఉందని ఎస్ఐ రఘునాథరావు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


గడిగట్ల వరలక్ష్మి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో జనసేన నాయకుడు మృతి

పి.గన్నవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముంగండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిమ్ నిర్వాహకుడు, జనసేన నాయకుడు కత్తుల శ్రీనివాసరావు(35) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు శ్రీనివాసరావు గత కొంతకాలంగా పోతవరంలో జిమ్ నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వై.కొత్తపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో ముంగండ ముత్యాలమ్మ గుడి సమీపంలోకి వెళ్లే సరికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి సమీపంలో ఉన్న గోడను ఢీకొన్నాడు. దీంతో తలతో పాటు శరీరభాగాలకు బలమైన గాయాలు కావడంతో అంబాజీపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహామేరకు వైద్యం నిమిత్తం కాకినాడ తరలించడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లేసరికి శ్రీను మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. శ్రీను అకాలమరణంతో వై.కొత్తపల్లిలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీను పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు.


శ్రీనివాసరావు (ఫైల్)

నేటి నుంచి

వాడపల్లిలో పవిత్రోత్సవాలు

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం తిరుమల తరహాలో సోమవారం నుంచి 3 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు సకల దోష పరిహార్థం పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకుర్పారణ, నవమూర్తి ఆవాహన, పంచసయ్యాధివాసం... మంగళవారం ఉదయం అష్టకళస స్థాపన, మహాశాంతిహోమం, సాయంత్రం పవిత్ర ఆరోహణ నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం పవిత్ర విసర్జన, మహాపూర్ణాహుతి, కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొననున్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో ప్రతిరోజు నిర్వహించే అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు, ఉపనయనాలు రద్దు చేయడం జరిగిందని, 7వ తేదీన యథావిధిగా కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు.


వాడపల్లిలో వేంకటేశ్వరస్వామికి పవిత్రాలతో అలంకరణ (ఫైల్)

16 నుంచి విజయదుర్గా పీఠం వార్షికోత్సవాలు


పీఠంలో వార్షికోత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న గాడ్ తదితరులు

రాయవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠం 53వ వార్షికోత్సవాలు ఈనెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆదివారం పీఠంలో ఆయన మాట్లాడుతూ 16న ఉదయం 8గంటల 45 నిమిషాలకు గాడ్ కుమార్తె సత్యవెంకట కామేశ్వరి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభిస్తారని చెప్పారు. 16న ఉదయం భద్రాచలం వేదపండితులతో శ్రీసీతారాముల కల్యాణం, సాయంత్రం 6:30 గంటలకు నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శక్తిమాల, మణిద్వీప వర్ణనశ్లోకాల పారాయణం, సువాసినిల పూజల జరుగుతుందన్నారు. 17న ఉదయం నెల్లూరు జిల్లా జొన్నవాడ కామాక్షి తాయి ఆలయ అర్చకులతో నవారణ అర్చన, సాయంత్ర అన్నవరం వేదపండితులతో రమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి కల్యాణం, 18న తిరుమల వేదపండితులతో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైఖానస ఆగమం ప్రకారం జరుగుతుందని, రాత్రి 7 గంటలకు విజయదుర్గా అమ్మవారికి లక్ష గులాబీల పూజ జరుగుతాయన్నారు. వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని పీఠాధిపతి గాడ్ చేతులమీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి తదితరులు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో రైల్వే డీఆర్ఎం ప్రత్యేక పూజలు


భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం పొందుతున్న రైల్వే డీఆర్ఎం

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనకియా ఆదివారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు డీఆర్ఎంకు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా ఆలయంలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. అనంతరం భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. ఈవో స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని అందజేశారు.

ఉత్కంఠగా..

కాకినాడలో మూడో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


హాకీ ఆడుతున్న ఉత్తరాఖండ్, అస్సాం జట్లు


మ్యాచ్ తిలకిస్తున్న ముఖ్య అతిథులు




ఉత్తరాఖండ్ ప్లేయర్‌కి ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందిస్తున్న రమణమూర్తి

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగుతున్న ఇండియన్ ఆయిల్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్ షిప్-2025లో భాగంగా ఆదివారం మూడోరోజు రెండు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. మ్యాచ్‌ల ఫలితం తేలక డ్రాగానే ముగిశాయి. ఇరు జట్లు గోల్స్ చేయడానికి పోటీపడ్డాయి. దీంతో ఉత్కంఠగా మ్యాచ్‌లు సాగాయి.

మ్యాచ్‌ల వివరాలు...

కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్ లోని రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఉత్తరాఖండ్ వర్సెస్ అస్సాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-2 స్కోరు నమోదు చేయడంతో డ్రాగా ముగిసింది. బీహార్ వర్సెస్ తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-2 స్కోరు నమోదు చేయడంతో డ్రాగా ముగిసింది. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సీఈవో హెడ్ ఆఫ్ ఫైనాన్స్ డి.రమణమూర్తి, కేంద్ర మంత్రిత్వ హైవే ఇండస్ట్రీస్ డైరెక్టర్ జీ.సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు. డీఎస్డీవో బి.శ్రీనివాస్ తదితరులు మ్యాచ్‌లను పర్యవేక్షించారు.

నిడదవోలులో చోరీ


ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

నిడదవోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు సంజీవయ్యనగర్ (బుక్కాపేట)లోని మనుబోలు వెంకటేశ్వరరావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. గత వారం రోజులుగా ఇంటి యజమానికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో విజయవాడలో ఉంటున్నారు. శనివారం రాత్రి ఆ కుటుంబం ఇంటికి చేరుకోగా ఇంట్లో దొంగలు పడినట్టు గుర్తించారు. సుమారు 20 కాసుల బంగారం, వెండి, నగదు చోరీ అయ్యాయని మనుబోలు గౌతమి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీసీఎస్ క్రైమ్ సీఐ శ్రీధర్‌కుమార్ తదితరులు పరిశీలించారు. క్లూస్‌టీం ఆ ఇంటి తలుపులపై నమోదైన వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై 6న విచారణ

రంపచోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజోతి): ఇటీవల కింటుకూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఈనెల 6న బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మెజిస్ట్రియల్ విచారణ చేపడుతున్నట్టు సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ


రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

రూ.35 లక్షల ఆదాయం

అన్నవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. నెలవుదినం, స్నేహితుల దినోత్సవం కారణంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి సన్నిధికి విచ్చేసి స్వామివారి వ్రతం, దర్శనాలు చేసుకున్నారు. ప్రత్యేక దర్శనానికి గంట వ్యవధి, ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో సుబ్బారావు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో 2800 వ్రతాలు జరగగా రూ.35 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుడికి ఆర్జిత సేవైన రథోత్సవం ఘనంగా జరిగింది.

నేటి నుంచి వనదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణలు

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ అమ్మవారికి సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం లక్ష కుంకుమార్చనలు జరుగుతాయని భక్తులు పాల్గొనాలని దేవస్థానం అధికారులు కోరారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.5.41 లక్షల ఆదాయం


ఆలయ ప్రాంగణంలో భక్తులు, దర్శనమిస్తున్న తలుపులమ్మ

తునిరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపు లమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. వేలాది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిసింది. ప్రత్యేక క్యూలలో బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఆదివారం రూ.5.41 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

జగ్గంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట గవర్నమెంట్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులను రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్టు జూడో జిమ్ అండ్ కరాటే మాస్టర్ టీవీవీ రమణ తెలిపారు. బి.ఓంకార్, టి.వివేక్, పి.జయ, బిబ్లెస్సిరాజ్, జె.రవీంద్ర, అభి, కె.సింహాచలం, వి.శ్రీలక్ష్మి, ఏ.దుర్గాధరన్, సీహెచ్ శ్రీరామ్, వి.వీరమణికంఠ, కెఎస్.రాజ్, ఎ.శిరీష, బి.తేజస్వి, బి.దయ, టి.వైష్ణవి, పి.సంజయ్, జి.ఆదిశంకర్, డి.శ్రీనివాస్, జి.జోషఫ్, శ్రీరామ్ జి.పరమేశ్వరి, టి.సంధ్య గాయత్రి, ఏఎస్‌బి.అమృతలు పల్నాడు జిల్లాలో ఈనెల 9,10న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను కాకినాడ డీఎస్పీ కోచ్ తేజ, సాయి కృష్ణ, దేవి కృష్ణశ్రావణ్ తులసి పలువురు అభినందించారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


బాలకృష్ణ (ఫైల్)

మండపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజమహేంద్రవరం జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ వై.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన గుత్తుల యువబాలకృష్ణ (26) మండపేట పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. నానమ్మ వద్ద ఉంటున్నాడు. అతడి తల్లి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. బాలకృష్ణ నానమ్మ వద్ద ఉంటున్నాడు. పలు కారణాల వల్ల జీవితంపై విరక్తి చెందిన బాలకృష్ణ ఈనెల 2న ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం యువకుడు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఆదివారం అప్పగించామని హెడ్‌కానిస్టేబుల్ వై.నాగేశ్వరరావు తెలిపారు.

గేదెను ఢీకొని యువకుడి మృతి

మరొకరికి గాయాలు


తాతాజీవర్మ (ఫైల్)

తాళ్లరేవు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కోరింగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొప్పాడి తాతాజీవర్మ (19) స్నేహితుడుతో కలసి ద్విచక్రవాహనంపై కాకినాడ బయలుదేరారు. కోరింగ దుర్గమ్మగుడి ప్రాంతానికి వచ్చేసరికి ద్విచక్రవాహనానికి గేదె అడ్డురావడంతో ఢీకొని ఇద్దరు కిందపడ్డారు. దీంతో తాతాజీవర్మ తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. స్నేహితుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. తాతాజీవర్మ మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

తండ్రిపై హత్యాయత్నం కేసులో కుమారుడికి రిమాండ్

అమలాపురం రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మానవత్వాన్ని మరిచి బీమా సొమ్ముల కోసం తండ్రి వెంకటరమణపై హత్యా యత్నం చేసిన కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం సాకుర్రుకు చెందిన వైసీపీ యువ నాయకుడు విప్పర్తి హర్షవర్ధన్‌కు ఈ నెల 14వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. హర్షవర్ధన్‌ను అమలాపురం ఏజీఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ రహ్మతుల్లా ముందు హాజరు పరుచగా రిమాండ్ విధించగా కొత్తపేట సబ్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పేకాడుతున్న వారిపై ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. సిద్దా రాంబాబు, షేక్ రహీంబాబును అరెస్టు చేసి వారి నుంచి రూ.2,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారు పరారయ్యారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపరచనున్నట్టు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు పట్టణ శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.17,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పూర్వ విద్యార్థులు.. అపూర్వ కలయికలు



కాకినాడలో కలిసిన పదోతరగతి పూర్వ విద్యార్థులు, సామర్లకోటలో పూర్వ విద్యార్థులు

కాకినాడ రూరల్/సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 1996-97లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకుని ఆనాటి తీపిజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సమ్మేళనంలో రాష్ట్ర ఇంటర్‌విద్య ఆదనపు డైరెక్టర్ పి.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. ప్రత్యేక అతిథులుగా కాంతారావు, మల్లేశ్వరరావు, సూర్యకాంతం, సుబ్రహ్మణ్యం, ఆర్జేడీ రాజు, సుందర్‌బాబు, శేషగిరి, రోహిణి, హెల్డా, సత్యనారయణమ్మ పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులు తమ గురువులందర్నీ సత్కరించారు. సమ్మేళనంలో పాఠశాల విద్య జోన్-2ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్, ఏపీసీ పి.వేణుగోపాలరావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమజ్యోతి అధ్యక్షత వహించారు. అలాగే 42 ఏళ్ల క్రితం సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా వీరంతా ఒకే వేదికపై కలుసుకుని నాటి అల్లరిపనులు, చిలిపిచేష్టలను గుర్తు చేసుకుని కేరింతలు కొట్టారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కాకినాడ ఐడియల్ కాలేజీలో 7న మెగా జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఐడియల్ కాలేజీలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ మల్టిపుల్ ట్రైనింగ్ సెంటర్‌కు రూ.30 వేలు విరాళం

కాకినాడ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరామ్‌నగర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం లయన్స్ క్లబ్ సఖి ఆధ్వర్యంలో పర్యావరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాల కృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం లయన్స్ మల్టిపుల్ ట్రైనింగ్ సెంటర్‌కు రూ.30వేలు చెక్కును లయన్స్ క్లబ్ సఖి కోశాధికారి మంగా కాశీఅన్నపూర్ణ బాల కృష్ణకు అందజేశారు. ఆమె స్పాన్సర్ చేసిన క్లాత్ బ్యాగ్‌లను డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. విశిష్ట అతిథిగా రీజనల్ చైర్మన్ దేవత పుత్రరావు విచ్చేయగా క్లబ్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి సావిత్రి, లయన్స్ క్లబ్ సభ్యులు జీఎంటీ పద్మతులసి, డీసీ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందక...



కొండెవరంలో సాగు నీరందక ఎండిపోతున్న వరి నాట్లు

కొత్తపల్లి మండలంలో ఎండిపోతున్న సార్వా వరి నాట్లు

మోటార్లతో నీరు తోడుకుని కాపాడుకుంటున్న రైతులు

కొత్తపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు సాగునీరు అందక వరి నాట్లు ఎండిపోతున్నాయి. పీబీసీ కెనాల్ పరిధిలోని కొత్తపల్లి మండల ఆయకట్టులో పలు గ్రామాల్లో వరి నాట్లు వేశారు. సుమారు వారం, పది రోజులుగా వాతావరణ మార్పులతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నాట్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు కాలువల నుంచి నీటిని మోటార్లతో తోడుకుంటూ నాట్లు ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు. రెండో పంట సాగులో సక్రమంగా నీరందక మోటార్లతో నీటిని తోడేవారమని, ప్రస్తుతం సార్వా సీజన్లోనే ఈ పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన చెందుతున్నారు. నాట్లు పూర్తయ్యే వరకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొండెవరం కొండయ్య కాలువ నుంచి మోటారుతో నీరు తోడుతున్న దృశ్యం



ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు నామినేషన్ అందజేస్తున్న ఎంపీ సతీష్‌బాబు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి సతీష్‌బాబు నామినేషన్

కాకినాడ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.



మరిడమ్మ అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

మరిడమ్మ దేవస్థానం వద్ద భారీ అన్నదానం

పెద్దాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా దేవస్థానం వద్ద ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. జాతర విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, భక్తులకు రాజప్ప కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి హర్ష, సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి జలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'పురుషోత్తపట్నంతో రెండు పంటలకు సాగు నీరు'

పిఠాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా పిఠాపురంతో పాటు పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు లభిస్తోందని ఇది సీఎం చంద్రబాబునాయుడు దూరదృష్టి ఫలితమేనని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు సాగునీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ఆయన ఏలేశ్వరం జలాశయాన్ని సందర్శించారు. ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు ఏలేరులో కలుస్తున్న ప్రాంతం వద్ద చంద్రబాబు ఫ్లెక్సీకి జలాభిషేకం నిర్వహించారు. ఏలేరు, గోదావరి జలాలకు వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ... ఈ ఏడాది ఏలేరు రిజర్వాయర్‌లో కేవలం పది టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో తాను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణం పంపులు ఆన్ చేయడానికి ఆదేశాలు ఇచ్చారని వివరించారు. ఇప్పుడు ఈ నీటితోనే ఏలేరు. పీబీసీ ఆయకట్టులో పంటలు సాగవుతాయని తెలిపారు. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈఈ ప్రసాద్, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీయువసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



కేక్ కట్ చేస్తున్న శ్రీయువజేన అధ్యక్షుడు సతీష్. చిత్రంలో ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ 12వ వార్షికోత్సవం, బ్లడ్ బ్యాంక్ 5వ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షుడు బొల్లం సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సూర్యకళా మందిరం హాలు-2లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో సుమారు 350 మంది రక్తదానం చేశారు. అతిథులుగా విచ్చేసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావనితిరుమలకుమార్ రక్తదాతలను అభినందించారు. మహేంద్ర సంస్థ అధినేత మహేంద్రకుమార్, కొమ్మిరెడ్డి శ్రీహర్ష, వారి మిత్రులు పేద విద్యార్థుల చదువు నిమిత్తం రూ.7,32,630 విలువైన చెక్కును అధ్యక్షుడు సతీష్‌కు అందజేశారు. నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20వేలు చొప్పున మొత్తం రూ.80 వేలను అతిథులు అందజేశారు. బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సహకరించిన గుంటూరు జిల్లాకు చెందిన గుడూరు శ్రీధర్, సోము స్వాతి, రాజ్ కుమార్‌లను, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన సభ్యులను, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుమారుడు మోహనవర్మ, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, కత్తిపూడి బాబి, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.



స్నేహితుల దినోత్సవ వేళ రక్తదానం

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలుకు చెందిన 30 మంది యువకులు ప్రతిఏటా మాదిరిగా ఆదివారం ఫ్రెండ్‌షిప్‌డే నాడు కలుసుకుని రక్తదానం చేశారు. కాకినాడ సూర్యకళా మందిరంలో జరిగిన శిబిరంలో గణేష్, నాని, చక్రి, చలపతి, మణిదీప్, రాంబాబు, ప్రసాద్, గంగాధర్, వెంకటేష్, మణికంఠ, చరణ్, శిరీష్, బెనహరి, శేఖర్, వెంకటేష్ రక్తం ఇచ్చారు.



రమణయ్యపేటలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

'స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ రమణయ్యపేటలోని డీ4 విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం దర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఎం మండల కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు, వలసపాకల ఏరియా కార్యదర్శి తొట్టిపూడి రాజా పేర్కొన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ఆదివారం రమయ్యపేట మార్కెట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజలపై అన్ని రకాలుగా ఆర్థిక భారం మోపుతుందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లతో కరెంటు బిల్లు మూడు రెట్లు పెరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 9సార్లు విద్యుత్తు చార్జీలు పెంచి ప్రజలపై 32వేల కోట్ల భారం వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టూరి విజయ్‌కుమార్, వాసంశెట్టి సూర్యం, కుమార్, రామకృష్ణ, నాగేంద్ర, సురేంద్ర, ధనుష్, నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు సబ్ స్టేషన్ ముట్టడి

పిఠాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కరెంటు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా మంగళవారం పట్టణం లోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడి స్తామని ఆ పార్టీ పిఠాపురం శాఖ కార్యదర్శి సాకా రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్మార్ట్‌మీటర్లు బిగించిన గృహాలు, భవనాల యజమానుల వద్దకు, జనసమూహ ప్రాంతాలకు వెళ్లి కరపత్రాలు పంచారు. నాయకులు ఎంజేపీ పెట్టరిక్, పేపకాయల ప్రసాద్, రాజాల నాగేశ్వరరావు, బత్తిన రాజు, ప్రశాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.





పెద్దాపురం మండలం పులిమేరు శాంతివర్ధన విభిన్నప్రతిభావంతుల పాఠశాల, కాకినాడ జిల్లా గొల్లప్రోలుల్లో కేక్‌లు కట్ చేస్తున్న దృశ్యాలు

స్నేహితుల దినోత్సవ వేడుకలు

పెద్దాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఫ్రెండ్స్ పరివార్ యూత్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు బిస్కట్లు, పండ్లు పంచారు. ఫ్రెండ్స్ పరివార్ యూత్ సభ్యులు నూతలపాటి సత్తిబాబు, సాంబశివ, పి.లోవరాజు, అర్జున్, కె.లోవరాజు, శ్రీను, నారాయణ, రాజేష్, బాబీ, తాతారావు, అనిల్, ట్రాఫిక్ విశ్రాంత ఎస్ఐ సతీష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలుల్లో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా నిర్వహించారు. స్నేహితులు, కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కలుసుకుని కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు తమ స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టారు.



సొసైటీ చైర్మన్ నారాయణరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెనుగుదురు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారోత్సవం

కరప, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగుదురు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్మన్ రెడ్డిపల్లి నారాయణరావు, సభ్యులు నాగేశ్వరరావు, కృష్ణమూర్తిలను వారు సత్కరించి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాంబాల వెంకటేశ్వరరావు, బండారు మురళి, గంగాధర్, మద్దూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో పనులు... ఉపాధి కూలీలకు నష్టం

తాళ్లరేవు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వేమవరంలో సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అధ్యక్షతన ఆదివారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ జరిగింది. కూలీలకు చెప్పిన పని దినాలు, యంత్రాలతో వేసిన ఆర్‌సీసీ రోడ్ల వివరాలను సోషల్ ఆడిట్ బృందం ఎస్ఆర్‌పీ నాగ సత్యనారాయణ ఆధ్వర్యంలో డీఆర్పీ సత్తిరాజు వివరించారు. జి.వేమవరంలో 74 వర్కులకు గాను ఉపాధి కూలీలకు 68 వర్కులకు సంబంధించి రూ.27,42,314 వేతనాలుగా చెల్లించారు. ఆరు ఆర్‌సీసీ రోడ్లకు రూ.70 లక్షలు ఖర్చు చేశారు. నిధులను యంత్రాల ద్వారా చేసిన పనులకు చెల్లించడంతో కూలీలు పనిదినాలు నష్టపోయారు. సామాజిక తనిఖీ నివేదికలో కొన్ని లోపాలు బయటపడ్డాయి. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంటి అప్పారావు, ఎంపీటీసీ యర్రంసీడి అప్పారావు, పుణ్యమంతుల సత్తిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ దంగేటి సత్తిబాబు, ఉపాధి మేట్లు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నివేదికలోని అంశాలను వివరిస్తున్న డీఆర్పీ సత్తిరాజు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ పిలుపునిచ్చారు. కాకినాడ ఐడియల్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా ప్లీనరీ ఆదివారం జరిగింది. స్వాతంత్య్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదాలతో కూడిన ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశాయన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం విద్యను కార్పొరేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, నాయకులు సాహితి, వాసు, సంజయ్, వరహాలు, చిన్ని, సంతోష్, జయరామ్, సిద్ధు, మణికంఠ, నాని, ఆదర్శ, రాజేష్, కరుణ్ కుమార్, సత్యం, భువనేశ్వరి, అక్షిత, గీత, రాజీ, యమున, ప్రసన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాకినాడ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనాపల్లి, రేపూరు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం గంగనాపల్లిలో ప్రధాన పంట కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. కాకినాడ-సామర్లకోట ప్రధాన రహదారి నుంచి గంగనాపల్లి వెళ్లే వంతెన పనులను పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్‌కుమార్, కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, తాడాల అబ్బు, పాండ్రంకి రాజు, కుర్రా నాగబాబు, సతీష్, సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, శ్రీనివాసరావు, ఎంపీటీసీ సత్యవేణి, మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఇన్‌చార్జి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీనివాస్, నక్కా శ్రీను, గోవిందు జనసైనికులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

రహదారి ఇలా... ప్రయాణమెలా!

పిఠాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అడుగడుగునా భారీ గోతులు. ఏమాత్రం ఆదమరిచినా అందులో పడి ప్రమాదాలకు గురికావాల్సిందే. పట్టణంలోని అనఘా దత్త క్షేత్రం వెనుక భాగంలో గత 15 ఏళ్ల కాలంలో భారీగా లే-ఔట్లు వేశారు. ఇక్కడ వందల సంఖ్యలో కుటుంబాలు గృహాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాయి. వారంతా పట్టణంలోకి వచ్చేందుకు గతంలో ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమైంది. భారీ గోతులు పడి అధ్వానంగా మారింది. వర్షాలు పడితే చాలు గోతుల్లోకి నీరు చేరి ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక మహిళలు, వృద్ధులు, విద్యార్థులు అందులో పడి గాయపడుతున్నారు. వాహనచోదకులకు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా కనీసం గోతులు కూడా పూడ్చలేదు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



అనఘా దత్త క్షేత్రం వెనుకవైపు గల నివాస గృహాల వారు బయటకు వచ్చే రహదారి గోతులతో అధ్వానంగా ఉన్న దృశ్యం

జగనన్న కాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీరు



గొల్లప్రోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు శివారులోని జగనన్న కాలనీలో కొద్ది రోజులుగా తాగు నీరు సక్రమంగా అందక అక్కడి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం స్పందించిన ఆయన ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో జగనన్న కాలనీకి రెండు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వైడీ రామారావు, డాక్టర్ రాఘవేంద్రరావు

తైక్వాండో విజేతలకు అభినందన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఇటీవల తైక్వాండో జాతీయ ఓపెన్ చాంపియన్‌షిప్ జరిగింది. ఇందులో 23 మంది పాల్గొనగా ఏడుగురు స్వర్ణ, ఏడుగురు రజత, నలుగురు కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం వారికి బోట్ క్లబ్ పార్కులో మెడల్స్, ప్రశంసాపత్రాలను రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు అందజేశారు. కోచ్ డి.సతీష్‌ని అభినందించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాదరావు, డి.శ్రీధర్, ఆర్.బాపిరాజు, పి.ధర్మచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ కృష్ణకి మంత్రి సుభాష్ పరామర్శ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మోకాలి నొప్పికి శస్త్ర చికిత్స చేయించుకున్న కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి చిన్న కుమారుడు, టీడీపీ యువ నాయకుడు కల్యాణ్ కృష్ణని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రాత్రి పరామర్శించారు. కల్యాణ్ కృష్ణ ఆరోగ్యం గురించి టీడీపీ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, అనంత లక్ష్మి దంపతులను అడిగి తెలుసుకున్నారు. రూరల్ నియోజక వర్గ రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించారు.

సత్తెమ్మ ఆలయంలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయోధ్యరామపురం సత్తెమ్మ ఆలయం వద్ద రూ.3లక్షలతో షెడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం భూమి పూజ చేశారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, గౌరవాధ్యక్షుడు అడబాల కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష పండితుడు చీమలకొండ వీరభద్ర ప్రసాద్, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



భోగాపురంలోని జంగం వారి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

గుర్రపుడెక్క తొలగించరూ!

పిఠాపురం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం భోగాపురంలోని జంగం వారి కాలువలో పూడిక తొలగించకపోవడంతో సాగునీరు ముందుకు కదలక రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఏలేరు కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించాలని అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు ప్రకటిస్తున్నా ఈ ప్రాంతంలోని కాలువ అంతా గుర్రపుడెక్కతో నిండిపోయిందని రైతులు తెలిపారు. పొలాల్లో నీరు నిలిచిపోతోందని, అధిక వర్షాలు కురిస్తే పొలాలతో పాటు గ్రామంలోని నివాసగృహాల్లో నీరు చేరే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

గండేపల్లి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మం డలం నీలాద్రిరావుపేట గ్రామశివారు పేకాట ఆడు తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.3250నగదు స్వా ధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రంపచోడవరం టీడీపీ మండలాధ్యక్షుడిగా అనంతమోహన్



అనంతమోహన్‌ను శాలువతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సరైన గుర్తింపు లభి స్తోందని ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ మిరియాల శిరీషదేవి అన్నారు. ఆదివారం పార్టీ పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ పర్యవేక్షణలో పార్టీ సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా పెంటపాటి అనంత మోహన్‌ను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, జీసీసీ డైరెక్టర్ గొర్లె సునీత, మాజీ మండలాధ్యక్షుడు అడబాల బాపిరాజు, ఏఎంసీ వైస్‌ఛైర్మ న్ సలాది బాపిరాజు, సీతపల్లి ఆలయ ఛైర్మన్ కె.బాపన్నదొర, వై.నిరంజనీదేవి పాల్గొన్నారు.

లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



కృష్ణకు నియామక పత్రం ఇస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఆగస్టు 3(ఆంధ్ర జ్యోతి): అల్లూరి సీతారామరాజుజిల్లా లెక్చరర్స్ అసోసియేషన్ అధక్షుడిగా కలి మికోట కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికలను నిర్వహించి అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్‌గా రవి, కార్యదర్శిగా జి.ఈశ్వరకృప, కోశాధికారిగా ఎన్.సాయిరమణను ఎన్నాకున్నారు. కలిమికోట కృష్ణ మా ట్లాడుతూ లెక్చరర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. అబ్జర్వర్ ఎన్ఏవీ ఆదిత్య, డాక్టర్ మురళి పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన



జనసేన కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ సాంబశివరావు

కూనవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో జనసేన పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన నిర్వహించారు. మండల వైస్ ఎంపీపీ జనసేన పార్టీ నాయకులు బండారు సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ రోజురోజుకీ బలపడుతున్న నేపథ్యంలో కార్యకర్తల రద్దీ పెరిగిందని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా జనసేనపార్టీ కార్యాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు రామారావు, పారి సోమయ్య, కె.అనిల్ యాలం శ్రీకాంత్ పాల్గొన్నారు.

'రాజయ్య సేవలు మరువలేనివి'



మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సీపీఎం నాయకుడు సున్నం రాజయ్య లేనిలోటు తీర్చలేనిదని ఆపార్టీ నాయకుడు యర్రంశెట్టి శ్రీనివాస రావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆయన చేసిన ఉద్యమాలు మరువలేనివన్నారు. ఆదివారం చింతూరు పార్టీ కార్యాలయం వద్ద రాజయ్య ఐదో వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ము ందుగా రాజయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నాయకులు ని వాళుల ర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాజయ్య పేద లు, ఆదివాసీల పక్షాన పోరాడిన పోరా టాలను గుర్తుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మా ట్లాడుతూ రాజయ్య ఉద్యమతీరుని యువత ఆదర్శం గా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు గెలిచిన రాజయ్య నిత్యం ప్రజలపక్షాన నిలిచి ఉండేవారన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లపు వెంకట్, లోతా రామారావు, సీసం సురేష్, మట్ల వాణిశ్రీ, వేక రాజకుమార్, పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, కారం నగేష్, మడకం చిన్నయ్య, చింతా రాంబాబు, వేక లెనిన్, పల్లపు పెద్దరాములు, తేపల్లి లక్ష్మయ్య, కారం కొండయ్య పాల్గొన్నారు.

ఒకే గ్రామం నుంచి
ముగ్గురు కానిస్టేబుళ్లుగా ఎంపిక



చింతూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన కానిస్టేబుళ్ల నియామకాల్లో పలువురు ఆదివాసీ యువకులు తమ సత్తాని చాటి కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో చింతూరు మండలం రామన్న పాలెంనకు చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికై పలువురి మన్ననలు పొందారు. వీరిలో పండా కళ్యాణ్, పాయం వెంకటేష్, గొర్రె నరేంద్ర ఉన్నారు. ఇదే గ్రామంలో ఇప్పటికే ఐదుగురు యువకులు కానిస్టేబుళ్లుగా నియమితులై ఉద్యోగాలు చేస్తున్నారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడకు దోహదం

మోతుగూడెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):వై.రామవరం మండలం బొడ్డగండి పం చాయతీ సింధువాడ గ్రామంలో మొక్కలు నాటి వనాలను పెంచడం ద్వారా మానవ మనుగడకు దోహదపడవచ్చునని సుస్థిర జీవన విధానాలకు మార్గం వేయవచ్చు నని ఆషా సంస్థ కార్యదర్శి సయ్యద్ సు భాని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు సంరక్షించి పెం చడం ద్వారా ప్రకృతిని కాపాడుకుని ముందు తరాల వారికి అందించవచ్చన్నారు. ఆదివారం సింధువాడ, బాబునగరం గ్రామస్థులకు 64 కుటుంబాలకు బంగినపల్లి మామిడి, జీడిమామిడి, జాఫ్రా, పండ్ల మొక్కలు ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా పంపిణీ చేశారు. రెండు దఫాలుగా మోతుగూడెం క్లస్టర్‌లోని అన్ని గిరి జన గ్రామాలలో రైతులకు పొలంగట్లపై ఖాళీ స్థలాల్లో వేసుకునేందుకు వివిధ రకాల పండ్ల మొక్కలను ఉద్యానవన ప రిశోధన కేంద్రం, పందిరి మామిడి, రంపచోడవరం, కడియపులంక నుంచి 7500 పండ్ల మొక్కలను 9 గ్రామాలకు చెందిన 312మంది గిరిజన రైతు కుటుంబాలకు పంపిణీ చేస్తామన్నారు. ఈమొక్కలను పెంచుకొని కాపాడుకోవడంవల్ల ఆదాయం పొందవచ్చనన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కోతుల బెడద వలన గిరిజన రైతులు పంట నష్టపోవడం జరుగుతుందని దాన్ని అరికట్టేందుకు పంట పొలాలకు సమీపంలో పండ్ల మొక్కలను వేసిన ట్లయితే అవి అక్కడ వరకు ఆగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింధువాడ గ్రామస్థులు, ఆశా సంస్థ సంయుక్త కార్య దర్శి జె.వెంకటేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ త్వరలో గుర్తించిన 50 మంది పేద గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు ఉచితంగా అందిస్తామన్నారు. వలంటీర్ అందాల రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చెరువును కమ్మేసిన సాల్వినియా గడ్డి

● నశించిపోతున్న పంటకు మేలుచేసే క్రిమిజాతులు
గడ్డి తొలగించాలని కోరుతున్న రైతులు



శంఖవరంలోని సిద్దావారి చెరువుని కమ్మేసిన సాల్వినియా గడ్డి

శంఖవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చూసేందుకు పచ్చ గా, అందంగా, ఆహ్లాదంగా కనిపించే మహమ్మారి చెరువులకు శత్రువుగా మారింది. చెరువుని అంతా ఆక్రమించి నీటినిల్వకు అడ్డంకిని కలిగిస్తోంది. చెరువుని కప్పేయడంతోపాటూ నీటిలో ఆక్సిజన్‌ని సంగ్రహించుకుని చేపలు, జీవులను కబళిస్తోంది. ఏడు ఎకరాలు విస్తీర్ణం కలిగిన శంఖవరం సిద్దావారిచెరువు సుమారు వంద ఎకరాలకు సాగునీరు అందించేది. ఇప్పుడు ఈ గడ్డి వల్ల చెరువులో నీటినిల్వకు వీలుకలగడం లేదు. ఈ గడ్డి కాలువలకూ పాకి నీరు పారేందుకు ఇబ్బందులు కలిగిస్తోంది. అజోల్లా జాతికి చెందిన సాల్వినియా అని ఇది అత్యంత వేగంగా విస్తరించి నీటిలో ఆక్సిజన్‌ను ఎక్కువగా సంగ్రహిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త రమణ తెలిపారు. ఈగడ్డి ఉన్న చెరువులో చేపలు తగ్గిపోవడంతో పాటూ పంటకు మేలు చేసే క్రిమిజాతులు కూడా నశించిపోతాయన్నారు. చెరువులో ఈగడ్డిని తొలగించి ఖరీఫ్ సీజన్‌లో పంటకు నీటి ఇబ్బందులు లేకుండా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా కాశీ కావిడ యాత్ర



కావిడియాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో వైభవంగా చేసుకునేటువంటి మార్వాడి కాశీకావిడి యాత్ర నిర్వహించారు. ఆదివారం ఉదయం జగ్గంపేట రాజగోపాలస్వామి ఆలయం నుంచి ఇర్రిపాక భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం వరకు నడుచుకుంటూ కావిడితో పాదయాత్ర చేశారు. భక్తిశ్రద్ధలతో మో సుకువచ్చిన గోదావరి జలాలను ఇర్రిపాక మల్లికార్జున స్వామి,భమరాంబికా అమ్మవారికి అభిషేకంచేసి మొక్కులను చెల్లించుకున్నారు వీరికి రామవరం జంక్షన్‌లో టీడీపీ రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు వారికి వాటర్ బాటిల్స్, డ్రింక్స్ అందించారు అనం తరం అడబాల వెంకటేశ్వరరావు, నాయకులు కలిపి భక్తిశ్రద్ధలతో కావిడ యాత్రలో పాల్గొని కాశీ కావిడను వారితోపాటు మోశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వారికి విందుకు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, ఎస్‌వీఎస్ అప్పలరాజు, అడబాల వెంకటేశ్వరరావు, పంద్రంగి రాంబాబు, జీను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, జోగారావు, మోతిలాల్ మాలి, తదితరులు హాజరయ్యారు.

విద్యాశాఖ ఉత్తర్వులతో విద్యార్థుల స్వేచ్ఛకు నష్టం



సమావేశంలో మాట్లాడుతున్నరాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్

జగ్గంపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి మేనే జ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా ఉన్నాయని ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ విమర్శించారు. జగ్గంపేటలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాక మిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మూలంగా పాఠశాలల విద్యార్థులు తమ స్వేచ్ఛను కోల్పోతారని అన్నారు. ఇది విద్యార్థులు ఎదుర్కొనే సమస్యను తెలుసుకునేందుకు వెళ్లిన వారికి ఈ ఉత్తర్వులద్వారా అనుమతులు ఉండ బోవని, దీనిద్వారా విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా విద్యార్థుల నోరునొక్కే ప్రయత్నం అవుతుందని ఆయన తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత



బాధితులకు ముద్రగడ కుమార్తె క్రాంతి నగదు, బియ్యం అందజేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడి అగ్నిప్రమాద బాధితులకు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి అండగా నిలిచారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆరు కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు వంతున రూ.30వేలు క్రాంతి అందజేశారు. బాధిత కు టుంబాలను ప రామర్శించి వారికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెదశంకర్లపూడి గ్రామ సర్పంచ్ సూర్నీడి నాగరత్నం సురేష్, నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు. బాధితులకు యర్రవరం వివేకానంద సేవాసమితి నాయకుడు ఫైరాల కనకారావు బాధిత కుటుంబానికి ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు వంతున రూ.30వేలు అందజేశారు.

'స్మార్ట్‌మీటర్ల ఆలోచనను విరమించుకోవాలి'

రంపచోడవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు ఉరి తాళ్లుగా మారుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ కుంజా దూలయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం స్థానిక మార్క్స్- ఏంగెల్స్ భవనంలో కత్తుల బాలురెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మంగళవారం స్థా నిక విద్యుత్ కార్యాలయంలో చేపట్టే ధర్నాకు ఆదివాసీ ప్రజా సంఘాలు, మహిళలు, విద్యార్థి సంఘాలు తరలి రావాలని కోరారు.

ఏవీ నగరంలో పలువురికి యనమల పరామర్శ

తొండంగి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏవీ నగరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు పిర్ల వెంకట్రావు, పిర్ల సత్యన్నారాయణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వారి గృహాలకు వెళ్లిన యనమల వారి ఆరో గ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నేతలు యనమల నాగేశ్వరరావు, యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, కొయ్యా శ్రీనుబాబు, మాజీ ఎంపీపీ యనమల కృష్ణ, కొయ్యా సూరిబాబు, అరిగెల నర్సింహమూర్తి , శ్రీను తదితరులు ఉన్నారు.



ఏవీనగరంలో పిర్ల సత్యనారాయణను పరామర్శిస్తున్న యనమల

ఏలేరుకు పురుషోత్తపట్నం
నీటిని అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే

● ఏలేరు జలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే వర్మ



ఏలేశ్వరంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

ఏలేశ్వరం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఏలేరుకు పురుషోతపట్నం నీటిని అందించిన ఘనత ముఖమంత్రి చంద్రబాబుదేనని మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్ వర్మ అన్నారు. ఆదివారం వర్మ పిఠాపురం నియోజకవర్గానికి చెందిన రైతు సంఘాల నాయకులతో ఏలేరు జలాశయాన్ని పరిశీలించారు. పుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి, గంగమ్మకు ప్రత్యేక పూజలుచేసి సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏలేరులో గోదావరి జలాలు విడుదల కావడంతో ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం. గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాలకు సాగు నీరు అందుతోందన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి
నిధులు మంజూరు చేయిస్తాం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



యనమలకు వినతిపత్రం అందజేస్తున్న పాత సంచుల వర్తక సంఘం సభ్యులు


తునిరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాత సంచుల వర్తకుల సంక్షేమసంఘం భవన నిర్మాణానికి నిధులు మం జూరు చేయిస్తామని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పాత సంచుల మరమ్మతుల కార్మికుల కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు మం జూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్.అన్నవరం శ్రీవీరాంజనేయ పాత సంచుల రిపేర్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆదివారం తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతనీడి అబ్బాయి, ఎస్.అన్నవరం పీఏసీఎస్ ఛైర్మన్ పోలిశెట్టి రామలింగేశ్వరావు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అప్పన రమేష్, గ్రామపార్టీ అధ్యక్షుడు బోడాల జమీల్ ఆధ్వర్యంలో యనమలను కలిశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్య క్షుడు పుత్తూరు నాగేశ్వరరావు భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను యనమలకు తెలియజేసి స్థలంతో పాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. అనంతరం యనమల మాట్లాడుతూ కార్మికుల భవన నిర్మాణానికి అన్నివిధాలా సహాయం అందిస్తానని చెప్పారు. యూనియన్ అభ్యున్నతికి పాటు పడతామని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు చిక్కాల రమణ, కార్యదర్శి నరిసే వీరబాబు, సంయుక్త కార్యదర్శి బుర్రా నాని, కోశాధికారి వీసం ప్రవీణ్, సహాయ కోశాధికారి రాసింశెట్టి వీరబాబు, చోడిశెట్టి శేషగిరి, కుపనం అజయ్, చోడిశెట్టి దొంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలు సంఘటితం కావాలి'



బవురువాకలో మాట్లాడుతున్న గంగరాజు

ప్రత్తిపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీలు సంఘటితం కావాలని జిల్లా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఒమ్మి గంగరాజు, బర్ల వెంకటరమణ, కుచ్చు అప్పలరాజు, బొడ్డు శ్రీనులు చెప్పారు. మండలంలోని బవురువాక గ్రామంలో ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తల సమావేశం బవురువాక గ్రామంలో లీగల్ సెల్ కన్వీనర్ చిలపర్తి శ్రీనివాసరావు మామిడితోటలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు మా ట్లాడుతూ బీసీలందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీలను విభజించి పాలించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీలందరూ ఏకతాటిపైకి వస్తేనే బీసీ సామాజికవర్గానికి అనేక ప్రయోజనాలు చేకూరతాయని వారు వివరించారు. అనంతరం సీమాంధ్ర జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఒమ్మి గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బర్ల వెంకటరమణ, జిల్లా కార్యదర్శి సుర్ల శ్రీనివాస్‌లను సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీను, పిఠాపురం, తుని నియోజకవర్గ నాయకులు యనమల శంకరుడు, షేక్ నాగూర్ సాహెబ్, వట్ల వెంకటరమణ, సారిపల్లి సూరిబాబు, ప్రజ్ఞ శ్రీనివాసరావు, జి.వీరాస్వామి ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



రావికంపాడులో రావిచెట్టు సెంటర్ వద్ద భారీ గోతులతో ఛిద్రమైన రోడ్లు

కాకినాడ కింగ్స్ క్రికెట్ సభ్యులకు సత్కారం

● పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్



కింగ్స్‌టీం సభ్యులను సన్మానిస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల నాల్గవ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలలో కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పాల్గొంటుంది. కాకినాడ కింగ్స్ జట్టు సభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్‌లో జరుగుతున్న ప్రీమియర్ లీగ్‌లో జట్టు సభ్యులందరూ ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. కాకినాడకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. సమిష్టి కృషితో అందరూ పోరాడాలని ఒక్కరోజులో ఏదీ సాధ్య పడదన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. టీంసభ్యులందరినీ నవీన్‌కుమార్ సత్కరించారు. టీం కెప్టెన్ భరత్ మాట్లాడుతూ కిర్లంపూడి మండ లం వీరవరం నా సొంత గ్రామం అని తెలిపారు. ఈ ప్రాంతం అంటే ఎంతో మక్కువ అని అన్నారు. జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, కొత్త కొండబాబు, అడపా తాతాజీ పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషిచేద్దాం'



లింగంపర్తిలో సమావేశమైన బీజేపీ నాయకులు.

ఏలేశ్వరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ జనరల్ సెక్రటరీ కుండ్ల సాయికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో కార్తకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గరికి నాగు, గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, విజయ కుమార్, ధర్మరాజు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో చోరీ



పగులగొట్టిన హుండీ

ఏలేశ్వరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దుర్గాదేవి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకురాలు దుర్గమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారుజామున దుండగులు ఆలయ కటకటాలకు ఉన్న తాళాలు పగులగొట్టి రెండు రాగి చెంబులు, 4 ఇత్తడి పళ్ళాలు, ఇత్తడి శటగోపం, డిబ్బీలో నగదు అపహరించినట్లు తెలిపారు. దుర్గమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులకు ఘన సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

కిర్లంపూడి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):కిర్లంపూడి వ్యవసాయశాఖ అధికారిణిగా పనిచేసిన జోకా అమృత, ముక్కో లు గ్రామంలో ఐదు సంవత్సరాలు పనిచేసి ఇతర మండలాలకు వెళ్లిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ముక్కోలు గ్రామ సర్పంచ్ జ్యోతుల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు విచ్చేసి ఉద్యోగులకు శాలువాకప్పి జ్ఞాపకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ ఎంపీపీ గోపు అచ్యుత రామ య్య గోపు నారాయణమూర్తి దొడ్డా అప్పారావు పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వీఆర్వో గురయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సూరిబాబు, రైతులు కలిసి ఘనంగా సత్కరించారు.

కంచుమర్తి రాఘవకి సత్కారం



కంచుమర్తి రాఘవను సన్మానిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీలో ఎన్నికైన కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కంచుమర్తి రాఘవను ఆదివారం రామచంద్రపురంలో కిర్లంపూడి మండల టీడీపీ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తోట రవి, ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు, వీరవరం సొసైటీ ఛైర్మన్ తోట గాంధీ, అనుకుల శ్రీకాంత్, క్లస్టర్ ఇంచార్జ్ పాఠంశెట్టి మురళీకృష్ణ, శృంగరాయునిపాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

రావికంపాడు రోడ్డు గోతులమయం

● ప్రమాదానికి గురవుతున్న ప్రయాణికులు

తొండంగి, ఆగస్టు 3: (ఆంధ్రజ్యోతి): రావికంపాడు గ్రామంలో ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. కత్తిపూడి-పెరుమాళ్ళపురం గ్రామాల మధ్య ఉన్న రహదారిపై రావికంపాడు రావి చెట్టు సెంటర్ వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నిత్యం ఈ రహదారి గుండా ఈ ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీలకు భారీ వాహనాలు వెళుతూ రహదారిని ఛిద్రం చేస్తున్నాయి. వర్షాలు వచ్చినపుడు గోతుల నిండా నీరు నిలిచి ఉండడంతో గోతుల లోతు తెలియక అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. పెరుమాళ్ళపురం మీదుగా కత్తిపూడి వెళ్లేందుకు ద్విచక్రవాహనాలపై వెళ్లే దంపతులు అనేక పర్యాయాలు ప్రమాదం బారినపడి గాయాలబారిన పడ్డ సంఘటనలు అనేకం జరిగాయి. నిత్యం రాకపోకలు సాగించే భారీ వాహనాలకు చెందిన ఫ్యాక్టరీ యాజమాన్యమైనా స్పందించి గోతులు పూడ్చకపోవడంతో ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. అధికార్లు స్పందించి గోతులు పూడ్చి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు,